సంక్రాంతికి చార్జీల మోత

స్పెషల్ బసుల్లో 50శాతం అదనపు చార్జీలు

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పేలా లేవు. ఆర్టీసీ బస్సుల్లో సీట్లు నిండిపోవడం, రైళ్లలో ఇప్పటికే రిజర్వేషన్లు పూర్తవ్వడంతో ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఇదే అదనుగా తీసుకొని ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు టికెట్ల ధరలను అడ్డగోలుగా పెంచి జనం జేబులను ఖాళీ చేస్తున్నారు. మరోవైపు టీజీఎస్ ఆర్టీసీ సంక్రాంతికి 6,432 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. అందులో 557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లెవెలుగు,ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. కానీ, ప్రత్యేక బస్సుల్లో మాత్రం 50శాతం అదనపు చార్జీలు వసూలు చేస్తామని పేర్కొన్నది. హైదరాబాద్ నుంచి ఏపీకి ప్రతిరోజూ 200 బస్సులు నడుపుతున్నామని, అదనంగా మరో 100 ప్రత్యేక బస్సులు నడిపించనున్నట్టు తెలిపింది. ఇదిలా ఉంటే ప్రైవేటు బస్సుల టికెట్ల ధరలు దడపుట్టిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి స్లీపర్ ఏసీ బస్సుల్లో గరిష్ఠంగా రూ.7లకు పైగా వసూలు చేస్తున్నారు. ఆదిలాబాద్‌కు రూ.2,300,మంచిర్యాలకు రూ.3,500 తీసుకుంటున్నారు. మరోవైపు ఏపీఎస్‌ఆర్టీసీ హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు నిత్యం 352 బస్సులు నడుపుతున్నది. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు ప్రత్యేకంగా 2,400 బస్సులను అదనపు చార్జీలు లేకుండా నడుపుతామనడంతో డిమాండ్ పెరిగింది.

10న బీసీ మేధావుల సమావేశం

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): ఈ నెల 10న హైదరాబాద్ హరిత ప్లాజాలో బీసీ మేధావుల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగణన, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్టు తెలిపారు.

విధుల్లో చేరకుంటే తొలగింపే!

- ఎస్ఎస్ఏ ఉద్యోగులకు బెదిరింపుల పర్వం
- సమ్మె విరమించాలని డీఈవోల ఆదేశాలు
- ముఖ్యమంత్రి, మంత్రి బాటలో ఆఫీసర్లు
- భయభ్రాంతులకు గురవుతున్న ఉద్యోగులు

> సమ్మెలో ఉన్న మీ స్పెషలాఫీసర్ జాయిన్ కాకపోయినా సరే. ఇతర సిబ్బంది వ్యక్తిగతంగా జాయిన్‌కావొచ్చు. ఆదివారం సాయంత్రం వరకే అవకాశం. ఆ లోపు జాయిన్ కాని వారి జాబితాను సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు పంపిస్తాం
> – కేజీబీవీ టీచర్లకు సిద్దిపేట డీఈవో ఇచ్చిన ఆదేశాలు.

> కేజీబీవీ స్పెషలాఫీసర్ల పేరు మీదున్న బ్యాంక్ ఖాతాలను ఇన్‌చార్జి స్పెషలాఫీసర్ల పేరు మీదికి మార్చుతాం. ఆర్థిక అధికారాలను ఇతరులకు అప్పగిస్తాం
> – కేజీబీవీ అధికారుల హెచ్చరికలు.

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): సమ్మెలో ఉన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులను పాలకుల మాదిరిగానే విద్యాశాఖ అధికారులూ బెదిరింపులకు దిగుతున్నారు. దీనికి పైన ఉన్న కొన్ని ఆధారాలే నిదర్శనం. గతంలో ఇచ్చిన హామీనే నేడు అమలు చేయలేమని, ఉద్యోగులు సమ్మె మానాలని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక ధోరణి ప్రదర్శించగా, తెగేదాక లాగితే ఉద్యోగాలు ఊడుతయ్.. అని శనివారం మంత్రి సీతక్క హెచ్చరించారు. ఆ మరునాడే ఇదే రీతిలో అధికారులు సైతం బెదిరింపులకు దిగారు. ఏకంగా టెర్మినేట్ చేస్తామని అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఉద్యోగుల్లోని ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. సమ్మె వీగిపోయేలా కుట్రలకు పాల్పడుతున్నారు. దీంతో సమ్మె చేస్తున్న ఉద్యోగులంతా బెంబెలెత్తిపోతున్నారు. తొలుత పాఠశాల విద్యాశాఖ డెరెక్టర్‌తో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలు చర్చలు జరిపారు. మంత్రుల స్థాయిలో రెండు సార్లు చర్చలు జరిపారు. అయినా ఈ చర్చల్లో పురోగతి కనిపించలేదు. ప్రభుత్వం నుంచి డిమాండ్లపై స్పష్టతలేకపోవడంతో ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మెను కొనసాగిస్తున్నారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి రెగ్యులరైజ్ చేయడం సాధ్యంకాదని, సమస్యలు పరిష్కరించలేమని చేతులెత్తేశారు. సీఎం ప్రకటన నేపథ్యంలో విద్యాశాఖ దూకుడు పెంచింది. నయానో, బయనో చెప్పి దారికి తెచ్చుకునేందుకు ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నది.

పేస్కేల్ అయినా ఇవ్వండి

రెగ్యులైజ్ చేయడం సాధ్యంకాదని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం పెద్ద దుమారం రేపింది. సీఎం వ్యాఖ్యలు పుండుమీద కారం చల్లినట్టయింది. ఒకవేళ ఇప్పుడు రెగ్యులరైజ్ చేయకపోతే తమ రెండో ప్రధాన డిమాండ్ అయిన పేస్కేల్‌ను అమలుచేయాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

19 వేల కుటుంబాలం రోడ్డెక్కుతం!

ప్రభుత్వం కవ్వింపు చర్యలకు పాల్పడితే 19 వేల కుటుంబాలు రోడ్డెక్కాల్సి ఉంటుందని ఎస్ఎస్ఏ ఉద్యోగ సంఘం నేతలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటివరకు కేజీబీవీల్లోని బోధనేతర సిబ్బందిని సమ్మెలోకి దించలేదని, ప్రభుత్వం ఇలాగే పట్టుదలకు పోతే నాన్ కేజీబీవీల్లోని బోధనేతర సిబ్బందిని సైతం సమ్మెలోకి దించుతామని ఆ నేతలు హెచ్చరిస్తున్నారు. ఉద్యోగులెవరూ భయపడొద్దని, తమతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చిస్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం నేతలు దుండిగల్ యాదగిరి, అనిల్‌చారి, దుర్గం శ్రీనివాస్ తదితరులు పేర్కొంటున్నారు. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని వారు ప్రకటించారు.

సర్వశిక్ష ఉద్యోగులకు నమ్మకద్రోహం

- 26 రోజులుగా ఆందోళన చేస్తున్నా స్పందించకపోవటం దారుణం
- ఉద్యోగుల సమ్మెపై సర్కార్ బెదిరింపు ధోరణి
- వారి పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): సర్వశిక్ష ఉద్యోగులను చాయ్ తాగినంత సేపట్లో రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక వారికి నమ్మకద్రోహం చేశారని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ఇప్పుడు ఏమీ ఎరుగనట్టు సమగ్రశిక్ష అభియాన్ కేంద్ర ప్రభుత్వానికి చెందనదని, నిరసనలు కొనసాగిస్తే చర్యలు తీసుకుంటామని బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉద్యోగులు నిరసనను కొనసాగిస్తే తీవ్ర పరిణామాలుంటాయని ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆదివారం ఆమె ఎక్స్ వేదికగా మద్దతు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 19,600 మంది సర్వశిక్ష ఉద్యోగులు 26 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. కుటుంబాలతో సహా రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నా, వారితో సీఎం, మంత్రులు చర్చించకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

> సమ్మె విరమించి విధుల్లో చేరండి. వస్తారా లేదా మీ ఇష్టం. విధుల్లో చేరకపోతే ఉద్యోగం నుంచి టెర్మినేషన్ చేస్తాం
> – మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఓ ఎంఈవో స్వయంగా పంపిన ఎస్ఎంఎస్.

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మాట్లాడుతున్న అల్లం నారాయణ

అక్రెడిటేషన్లు తగ్గిస్తే ఊరుకోం

- 12 వేలు ఉన్న అక్రెడిటేషన్ కార్డులను 20 వేలకు పెంచాం
- జర్నలిస్టుల హక్కుల సాధనకు పోరాడుతాం
- మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

గజ్వేల్, జనవరి 5: అక్రెడిటేషన్లు తగ్గిస్తే ఊరుకునేది లేదని మీడియా అకాడమీ మాజీ చైర్మన్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో టీయూడబ్ల్యూజే (హెచ్-143) సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని, జర్నలిస్టుల హక్కుల సాధనకు పోరాడుతామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జర్నలిస్టుల ఆరోగ్యం కోసం రూ.35 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కోటి రూపాయలు ఉన్న బడ్జెట్‌ను స్వరాష్ట్రంలో రూ.100 కోట్లకు తీసుకెళ్లిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదివేల మంది జర్నలిస్టులకు శిక్షణ శిబిరాల ద్వారా వృత్తి నైపుణ్యాలను పెంచినట్టు గుర్తుచేశారు. కరోనా కష్ట కాలంలో 450 మంది జర్నలిస్టులకు రూ.20 వేల చొప్పున వైద్య ఖర్చుల నిమిత్తం ఇచ్చినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 12 వేలు ఉన్న అక్రెడిటేషన్ కార్డులను 20 వేలకు పెంచినట్టు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులను ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. అనంతరం గజ్వేల్ డివిజన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మహేందర్‌రెడ్డికి మద్దతు లేఖను అందజేస్తున్న జీహెచ్ఎంఏ సభ్యులు

వంగ మహేందర్‌రెడ్డికి జీహెచ్ఎంఏ మద్దతు

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : పీఆర్టీయూ టీఎస్ కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డికి తెలంగాణ గెజిటెడ్ హెచ్ఎం అసోసియేషన్ (జీహెచ్ఎంఏ) తమ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. జీహెచ్ఎంఏ అధ్యక్షుడు రాజగంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరిధర్ ఆదివారం మహేందర్‌రెడ్డిని కలిసి మద్దతు లేఖను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వంగ మహేందర్‌రెడ్డి గెలుపునకు కృషిచేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీ మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ టీఎస్ ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, జీహెచ్ఎంఏ కోశాధికారి తుకారం, 13 జిల్లాల అధ్యక్షప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలల్లో టీచర్ల కొరత

- సీఆర్టీలతోనే నెట్టుకొస్తున్న వైనం
- రెగ్యులరైజ్ చేయాలంటున్న సీఆర్టీలు
- ఉద్యోగాలపై మాట తప్పిన కాంగ్రెస్
- మండిపడుతున్న నిరుద్యోగులు

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ టీచర్ల కొరత వేధిస్తున్నది. కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు(సీఆర్టీ), అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్(ఏఐ)లతోనే విద్యా బోధన కొనసాగుతున్నది. అంతేకాకుండా భారీగా పోస్టులు ఖాళీగా ఉండటంతో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన దూరమవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని 322 ఆశ్రమ పాఠశాలలున్నాయి. ప్రతి ఆశ్రమ పాఠశాలలో కనీసం 14 మంది టీచర్ల అవసరం ఉంది. ఈ విధంగా చూసుకుంటే 4500 మంది టీచర్లు ఉండాలి.. కానీ 2,102 మంది సీఆర్టీలే పని చేస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలుగా మారిన 54 హాస్టళ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ పాఠశాలల్లో రెగ్యులర్ టీచర్ అన్న ముచ్చటే లేదు. 54 ఆశ్రమ పాఠశాలల్లో అయితే సీఆర్టీలను కూడా నియమించలేదు. కేవలం ఏఐ పోస్టులతోనే పాఠాలు బోధిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల భర్తీ చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కానీ భారీగా ఖాళీలున్నా ఇప్పుడా ఊసే ఎత్తడం లేదని నిరుద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మండిపడుతున్నారు. రెగ్యులర్ టీచర్ల స్థానంలోకి తమను తీసుకోవాలని సీఆర్టీలు 19 రోజులపాటు ధర్నాలు నిర్వహించారు. అయినా రేవంత్ సర్కార్ పట్టించుకోవడంపై సీఆర్టీల సంఘం నాయకుడు సంతోష్‌నాయక్ డిమాండ్ చేస్తున్నారు. కనీసం తమను సీఆర్టీలుగా అయినా గుర్తించి, వారి మాదిరిగానే జీతాలు ఇవ్వాలని ఏఐ సంఘం రాష్ట్ర నాయకుడు సురేందర్‌నాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా గిరి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికల ఫలితాలు ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్లుగా నవీన్ కుమార్, లావణ్యలత విజయం సాధించారు. జనరల్ సెక్రటరీగా ప్రేమ్(దేవేందర్), అడిషనల్ సెక్రటరీగా భూక్యా రాము, జాయింట్ సెక్రటరీలుగా పీ రాజేశ్వర్, యామిని కనకతార, వంశీధర్‌రెడ్డి, నీరజాక్షి, కే శ్రీనివాసరెడ్డి గెలుపొందారు.

కొత్తగూడెంలో విద్యార్థి ఆత్మహత్య

- స్పెషల్ క్లాసులు, ర్యాంకుల కోసం కళాశాల యాజమాన్యం ఒత్తిడి
- ఒత్తిడి తాళలేక ఇంటర్ సెకండియర్ విద్యార్థి బలవన్మరణం

చుంచుపల్లి, జనవరి 5: స్పెషల్ క్లాసులు, ర్యాంకుల పేరిట కళాశాల యాజమాన్యం వేధింపులను తాళలేక ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన భద్రాద్రి జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్‌కు చెందిన శనగ లక్ష్మణ్ కుమారుడు రాంపవర్ (18) స్థానిక లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ నలంద జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. బాగాచదివే విద్యార్థులను కళాశాల బాధ్యులు సపరేట్ బ్యాచ్ చేసి, ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక క్లాసులు పెట్టి కాలేజీలోనే చదివిస్తున్నారు. రాంపవర్ విద్యానగర్ కాలనీలోని తన నానమ్మ, తాతయ్య ఇంటి వద్దనే ఉంటూ కాలేజీకి వెళ్తున్నాడు. వారంరోజులుగా కళాశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే చదువుకుంటున్నాడు. కళాశాల బాధ్యులు సదరు విద్యార్థికి, అతడి తల్లిదండ్రులకు ఫోన్ చేసి, కాలేజీకి రావాల్సిందేనని, లేకుంటే హాల్ టికెట్ ఇవ్వబోమని స్పష్టం చేశారు. దీంతో ఒత్తిడికి గురైన రాంపవర్ ఆదివారం ఉదయం నాలుగు గంటలకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు చుంచుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ రవికుమార్ స్పందిస్తూ.. రాంపవర్ కళాశాలకు వెళ్లని కారణంగా కాలేజీ బాధ్యులు అతడిని మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు.

ఆరోపణలు అవాస్తవం: చైతన్య, సీఈవో నలంద కాలేజీ, కొత్తగూడెం

గడిచిన 12 రోజుల్లో సదరు విద్యార్థి ఒక్కరోజు మాత్రమే కళాశాలకు వచ్చాడని, తామేమీ ఆ విద్యార్థిని వేధించడం లేదని చెప్పారు.

స్కూల్ ఫీజుల కట్టడి.. ఇప్పట్లో లేనట్టేనా!

- చట్టంపై ప్రభుత్వం కాలయాపన
- సగం పూర్తయిన విద్యాసంవత్సరం
- ఫిబ్రవరిలోనే అసెంబ్లీ సమావేశాలు
- దాదాపు పూర్తయిన ఫీజుల వసూలు
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన
- ప్రభుత్వం మేల్కోవాలని విజ్ఞప్తులు
- కఠిన చట్టమే పరిష్కారం: నిపుణులు



హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): స్కూల్ ఫీజులు కట్టడి చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఆ దిశగా నిర్దిష్టమైన చర్యలు చేపట్టడం లేదని విమర్శలు ఎదుర్కొంటున్నది. విద్యాకమిషన్, విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నదని తల్లిదండ్రులు, నిపుణులు మండిపడుతున్నారు. విద్యాసంవత్సరం సగానికి పైగా పూర్తయినా స్కూళ్ల ఫీజుల దోపిడీని ప్రభుత్వం అరికట్టలేకపోతున్నదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ప్రభుత్వం జాప్యం తీరు చూస్తుంటే మరో విద్యాసంవత్సరం వచ్చినా చట్టం కార్యరూపం దాల్చేలా కనిపించడం లేదని, మళ్లీ ఫీజుల గండం తప్పేలా లేదని విద్యారంగ నిపుణులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

కమిషన్ కసరత్తు ఏమైంది?

రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజుల నియంత్రణపై విద్యాకమిషన్ అన్ని వర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నదని, కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చేపడుతుందని అధికారులు చెప్తున్నారు. ఫీజుల కట్టడి కోసం జీవో జారీ చేసేందుకు కూడా సర్కారు సన్నాహాలు చేస్తున్నదని మరికొందరు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. కానీ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే చట్టం తీసుకురావాలని, జీవో వల్ల ఉపయోగం ఉండదని, అది కోర్టులో నిలబడదని నిపుణులు స్పష్టంచేస్తున్నారు. చట్టం రూపొందించాలంటే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. బడ్జెట్ సమావేశాలను ఫిబ్రవరిలో నిర్వహించే అవకాశముంది. అప్పుడు చట్టంపై దృష్టి పెట్టినా వచ్చే విద్యాసంవత్సరం నాటికి కూడా అమలు జరుగుతుందా లేదా అని సందేహాలు వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే సీబీఎస్ఈ స్కూళ్లు వచ్చే విద్యాసంవత్సరానికి కూడా ప్రవేశాలు ప్రారంభించి, లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయి.

విద్యాకమిషన్ పరిశీలనలు

రాష్ట్రంలో స్కూల్ ఫీజుల నియంత్రణ కోసం విద్యాకమిషన్ పలు ప్రతిపాదనలు పరిశీలిస్తున్నదని అధికారులు చెప్తున్నారు. స్కూళ్లలో ఫీజుల నియంత్రణ కోసం జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయడం, విస్తీర్ణం, వసతుల ఆధారంగా స్కూళ్లను 4 కేటగిరీలుగా విభజించడం వంటి పలు అంశాలపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. స్కూళ్లు ఫీజును 6.5 శాతం కంటే ఎక్కువ పెంచకుండా కట్టడి చేసేందుకు వీలుగా కూడా కమిషన్ నివేదికలో సిఫారసు పొందుపర్చనున్నట్టు చెప్తున్నారు.

తల్లిదండ్రుల విజ్ఞాపనలు

ఫీజుల పెంపు మూడేండ్లకోసారి మాత్రమే ఉండాలని, ఫీజుల నియంత్రణ కోసం రాష్ట్ర స్థాయిలో చట్టబద్ధ కమిషన్, ఫిర్యాదుల పరిష్కార విభాగం ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫామ్, స్టేషనరీని ఎక్కడైనా కొనుగోలు చేసే వెసులుబాటును కల్పించాలని కోరుతున్నారు.

పాఠశాలల యాజమాన్యాల వినతులు

రూ.50వేల లోపు ఫీజులున్న పాఠశాలలను ఫీజుల నియంత్రణ కమిటీల పరిధిలోకి తీసుకురావొద్దని, ఏటా 15శాతం ఫీజు పెంచుకునే వీలు కల్పించాలని పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు విద్యాకమిషన్‌ను కోరుతున్నారు. ఒక సొసైటీ ఒక పాఠశాలను మాత్రమే నడిపేలా చూడాలని, ఎక్కువ నడిపే సొసైటీలపై చర్యలు తీసుకోవాలని చెప్తున్నారు.

వర్గీకరణపై సీఎం మాట నిలబెట్టుకోవాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ

గజ్వేల్, జనవరి 5 : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలుచేస్తామని ఇచ్చిన మాటను రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సూచించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆదివారం వర్గీకరణ అమలు కోసం మాదిగ, మాదిగ ఉప కులాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ కోసం వచ్చే నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'లక్షల డప్పులు-వేల గొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వ్యభిచారం చేయాలని కుమార్తెపై ఒత్తిడి

- గదిలో నిర్బంధం, తప్పించుకున్న బాలిక
- పోలీసు కేసు నమోదు, తల్లిదండ్రుల అరెస్ట్

వెంగళరావునగర్, జనవరి 5: తల్లిదండ్రులే కన్నకూతురిపై దుర్మార్గంగా ప్రవర్తించారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని రహ్మత్‌నగర్‌లో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం రహ్మత్‌నగర్‌లో నివాసముండే దంపతులకు 14 ఏండ్ల కుమార్తె, 10 ఏండ్ల కుమారుడు ఉన్నారు. తల్లి ఉద్యోగం పేరుతో వెళ్లి చీకటిపడ్డాక ఇంటికి వచ్చేది. ఆమె వ్యభిచారం చేస్తున్నదని భర్తకూ తెలుసు. ఓ రోజు తల్లి ఫోన్‌లో మెస్సేజ్‌లు చదివిన కుమార్తె నిర్ఘాంతపోయింది. కూతురును కూడా వ్యభిచారంలోకి దింపేందుకు యత్నించింది. బాలికపై తల్లిదండ్రులు దాడి చేసి గదిలో బంధించారు. విటుడిని ఇంటికి పిలిచారు. అతడు రావడాన్ని గమనించిన బాలిక బాల్కనీ నుంచి పొరుగువారి సాయంతో బయటకు వచ్చి, రెండ్రోజులు తన స్నేహితురాలి ఇంటివద్ద తలదాచుకుంది. తన ఉపాధ్యాయులకు విషయం చెప్పింది. వారు చైల్డ్ హెల్ప్‌లైన్, పోలీసులకు తెలిపారు. పోలీసులు బాలికను ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని బాలిక తల్లిదండ్రులను అదుపులోకి తీసుకున్నామని సీఐ శ్రీనివాస్ వివరించారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ ఆత్మహత్య

భానుశంకర్ (ఫైల్)

గోల్నాక, జనవరి 5 : అనారోగ్య సమస్యలతో ఓ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేటలోని మల్లికార్జుననగర్‌కు చెందిన భానుశంకర్(47) పరిగి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఐదేండ్లుగా కిడ్నీ, ఇతర అనారోగ్య సమస్యలతోబాధపడుతున్నాడు. అనేక దవాఖానల్లో చికిత్స తీసుకున్న కూడా జబ్బు నయం కాలేదు. జీవితంపై విరక్తి చెందిన భానుశంకర్ ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఎస్సై, క్లూస్‌టీం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపులు

- నిజాంసాగర్ నవోదయలో ఘటన
- నలుగురు ఉపాధ్యాయులపై పోక్సో కేసు నమోదు

బాన్సువాడ, జనవరి 5: కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నలుగురు ఉపాధ్యాయులపై అధికారులు సస్పెన్షన్ వేటు వేయగా.. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై శివకుమార్ తెలిపారు. ఆదివారం నలుగురు ఉపాధ్యాయులను అరెస్టు చేసిన రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. విద్యాలయంలో కొంతకాలంగా విద్యార్థినులతో కొందరు ఉపాధ్యాయులు అసభ్యకరంగా ప్రవరిస్తూ, లైంగిక వేధింపులకు పాల్పడుతుండడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఆ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నలుగురు ఉపాధ్యాయులపై పోక్సో కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో అధికారులు ఓ ఉపాధ్యాయుడిని వారం రోజుల క్రితం కర్ణాటకకు బదిలీ చేశారు.

నీటి సంపులోపడి